జిల్లాలో పశుగణన షురూ

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: అఖిల భారత పశుగణనలో భాగంగా కలెక్టరేట్‌లో శుక్రవారం పశుగణన తెలంగాణ గోడపత్రికను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశుగణన కార్యక్రమం అక్టోబరు 25 నుంచి 2025 ఫిబ్రవరి వరకు నిర్వహించనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారని, దీని కోసం ఆ మండలానికి చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లకు బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారి పర్యవేక్షిస్తారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల సంఖ్యను లెక్కిస్తారని వివరించారు. పశువుల వయసు, లింగం, జాతికి సంబంధించిన డేటాను కూడా సేకరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, పశువైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తదితరులు

చన్నీళ్ల స్నానం.. వెంటిలేటర్ల నుంచి గాలి

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతుంది. చలికాలం కావడంతో ప్రభుత్వం దుప్పట్లు అందజేసినా వెంటిలేటర్ల నుంచి చలివేస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం చన్నీళ్లతో స్నానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిటికీలకు జాలీలు కూడా లేవు. తెల్లవారుజామున చలి ఎక్కువగా వస్తుందని విద్యార్థులు తెలిపారు.


వసతి గృహంలో అద్దాలు లేని కిటికీలు

వసతి గృహాల్లో విద్యార్థులను వెంటాడుతున్న సమస్యలు

వసతి గృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం చలి కావడంతో పిల్లలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. కొన్ని చోట్ల కనీసం దుప్పట్లు ఇవ్వలేదు. చలిలో చన్నీళ్లతో స్నానం చేస్తుండటంతో వణుకుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దుప్పట్లు ఏవి?

కోనరావుపేట: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల, వసతి గృహంలో 96 మంది ఉంటున్నారు. సుమారు 35 మంది విద్యార్థులకు మంచాలు లేవు. దీంతో కిందనే నిద్రిస్తున్నారు. పాఠశాల పునఃప్రారంభం తరవాత బెడ్‌షీట్లు, కార్పెట్లు అందించారు. చలికాలం ప్రారంభమైంది. స్వెట్టర్లు, దుప్పట్లు అందించాల్సి ఉన్నా నేటికీ అందలేదు. దీంతో విద్యార్థులు అందుబాటులో ఉన్న బెడ్‌షీట్లు, చద్దర్లు కప్పుకుంటున్నారు.


గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంచాలు లేని వసతి గది


జిల్లాలోని వసతి గృహాల వివరాలు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో మొత్తం 9 బీసీ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో ప్రీ మెట్రిక్ 3 నుంచి 5వ తరగతి వరకు అయిదు ఉండగా, వీటిలో 214 మంది విద్యార్థులు ఉంటున్నారు. పోస్ట్ మెట్రిక్, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు నాలుగు వసతి గృహాలు ఉండగా 355 మంది చదువుకుంటున్నారు. ఎస్సీ వసతి గృహాలు ప్రీ మెట్రిక్ 9 ఉండగా 484 మంది, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 3 ఉండగా 230 మంది ఉన్నారు. ఎస్టీ ప్రీ మెట్రిక్ హాస్టల్ ఒకటి ఉంది. ఇందులో 37 మంది ఉంటున్నారు.

పరిశీలన

కొత్తవి ఏర్పాటు చేయక...

ముస్తాబాద్: మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల, కళాశాల ఉన్నాయి. అందులో అయిదు నుంచి 10వ తరగతి వరకు 469 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 126 మంది ఉన్నారు. గురుకుల పాఠశాల, కళాశాల భవనాలకు మొత్తం 98 కిటికీలు ఉండగా 36 కిటికీల జాలీలు దెబ్బతిన్నాయి. కొత్తవాటిని ఏర్పాటు చేస్తే చలి రాకుండా ఉంటుంది. దీనిపై ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా జాలీల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. కళాశాల ల్యాబ్‌ల కోసం గదుల కొరత ఉండగా రూ.కోటి వ్యయంతో భవన నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు.


దెబ్బతిన్న కిటికీల జాలీలు

తెరలు తొలగిపోతున్నా...

గంభీరావుపేట: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. వార్డెన్ లేకపోవటంతో ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్ వసంతకు బాధ్యతలను అప్పగించారు. చలికాలం కావటంతో ముందస్తుగానే విద్యార్థులకు దుప్పట్లు అందించారు. దోమలు రాకుండా కిటికీలకు ఏర్పాటు చేసిన తెరలు తొలగిపోతున్నాయి. విద్యుత్తు వైర్లు సక్రమంగా లేవు. వదులు తీగలతో ప్రమాదకరంగా మారాయి. తెరలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై వార్డెన్‌ను వివరణ కోరగా కోతుల బెడద తీవ్రంగా ఉందని, కోతులు తెరలను తొలగిస్తున్నాయని తెలిపారు.



అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 9 బీసీ వసతి గృహాలు ఉండగా వీటిలో 6 ప్రభుత్వ, 3 ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నాం. ప్రైవేట్ వసతి గృహాలకు గత కొన్ని నెలలుగా అద్దె విడుదల చేయలేదు. వాటిలో చిన్న చిన్న మరమ్మతులు ఉంటే యజమానులు చేయిస్తున్నారు. పెద్దవి అయితే అద్దె చెల్లిస్తేనే చేస్తామంటున్నారు.

- రాజమనోహర్‌రావు,
జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి

ప్రాంగణ నియామకంలో 15 మంది ఎంపిక


ఈనాడు, సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అయిదు దశాబ్దాల పైగా చరిత్ర ఉంది. ఇక్కడ నైపుణ్యం ఉన్న నేత కళాకారులకు కొదువ లేదు. ఎక్కువగా ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు తీసుకొచ్చి ఉత్పత్తి చేసి ఇవ్వడం మినహా.. వీరి నైపుణ్యానికి తగిన బ్రాండ్ లేదు. దీనికి సిరిసిల్లకు చెందిన సాయి తేజ అనే ఎంటెక్ పూర్తి చేసిన యువకుడు 'సిరిసిల్ల సిల్క్' పేరుతో ఈ-కామ్ మార్కెట్‌ను ప్రారంభించాడు. ఎంఎస్‌ఎంఈ అనుమతి తీసుకున్న ఈ కంపెనీ గురువారం జేఎన్‌టీయూహెచ్‌లో తొలి ప్రాంగణ నియామకాలను చేపట్టింది. వివిధ విభాగాల నుంచి 60 మంది విద్యార్థులు హాజరుకాగా 15 మందిని ఎంపిక చేశారు. వీరికి 45 రోజుల శిక్షణ కాలం పూర్తయ్యాక వారి నైపుణ్యాలను బట్టి కంపెనీలో ఉద్యోగులుగా తీసుకుంటారు. సాధారణ, రాపియర్ మరమగ్గాలపై విస్కోస్, కాటన్‌తోపాటు చేనేతపైన వివిధ రకాల వస్త్రాలను ఉత్పత్తి చేయించనున్నారు. వీటి తయారీలో నైపుణ్యాలు, ఉత్పత్తి వ్యయం, కార్మికుల ఉపాధి తదితర అంశాలపై అధ్యయనం చేశారు.

సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయండి

ఈఆర్‌సీ ఛైర్మన్‌కు వినియోగదారుల విజ్ఞప్తి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘాన్ని ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయాలని పలువురు వినియోగదారులు ఈఆర్‌సీ ఛైర్మన్ శ్రీరంగారావుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సెస్‌లో విద్యుత్ ఛార్జీల పెంపుపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో పలువురు నాయకులతో పాటు రైతులు, వ్యాపారులు పలు సమస్యలను ఈఆర్‌సీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కొందరు సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయాలని కోరగా, మరి కొందరు విద్యుత్ ఛార్జీలు పెంచవద్దని విజ్ఞప్తి చేశారు. నెల రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే మార్చమని చెబితే మార్చలేదని, సెస్ ఎండీకి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోలేదని చంద్రంపేటకు చెందిన వినియోగదారుడు పరశురాములు వాపోయారు. సిబ్బంది పట్టించుకోకపోవడంతో పత్తి పంటకు నష్టం జరిగిందని, దానిని మార్చడానికి ఒక్కో రైతు వద్ద నుంచి రూ.500 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్తంభాలు వేయాలని కోరితే డబ్బులు అడుగుతున్నారని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యుడు ఓరుగంటి రామకృష్ణ పేర్కొన్నారు. నూతనంగా ఇల్లు కట్టుకున్న వారికి రెండో కేటగిరీ కింద కనెక్షన్ ఇస్తున్నారని, 4 నుంచి 5 మీటర్లు దాటితే ప్యానల్ బోర్డు పెట్టుకోవాలని చెబుతున్నారని, దానికి సంబంధించిన జీవో అడిగితే లేదంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు ప్రమాదంలో చనిపోయినవారికి ఇచ్చే నష్ట పరిహారం పెంచాలని కోరారు.


పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వినియోగదారులు

అంత్యక్రియలు
క్రోధి నామ సం॥ ఆశ్వీయుజ బ॥ షష్ఠి బుధవారం
తేది: 23-10-2024 రోజున మ॥ 12-01 ని॥లకు
మా తండ్రి గారగు
మర్రిపల్లి వెంకట నర్సింగారావు
(రిటైర్డ్ ప్రిన్సిపాల్, SRR కాలేజ్, కరీంనగర్)
గారు పరమపదించినారని తెలుపుటకు చింతిస్తున్నాము.
తేది: 26-10-2024 శనివారం రోజున
ఉదయం 10-00 గం॥లకు వారి అంతిమయాత్ర
మా స్వగృహం వావిలాలపల్లి, కరీంనగర్ నుండి
బయలుదేరి అలకాపురి కాలనీ స్మశానవాటిక
నందు అంత్యక్రియలు జరుపబడును.

మర్రిపల్లి వెంకట నర్సింగారావు గారు
పితృయజ్ఞము
తేది: 1-11-2024 దశాహము (ధర్మోదకాలు) 10-30 AM
తేది: 2-11-2024 వృషభోత్సర్జనము-షోడశము
తేది: 3-11-2024 సపిండీకరణము-ఊనమాసికము
జరుగును. కావున తాము వచ్చి వారి ఆత్మకు శాంతి చేకూర్చగలరు.
ఇట్లు
కుమారుడు-కోడలు:
మర్రిపల్లి వెంకటరమణ-డా॥ సంధ్య
మనుమడు: విధుర్
భార్య: మర్రిపల్లి సామ్రాజ్యం
కూతుర్లు-అల్లుండ్లు, మనుమలు, మనుమరాండ్లు
తమ్ముళ్ళు-మరదళ్ళు
కార్యస్థలము: స్వగృహము ఇ.నెం. 3-7-341,
Near గోపికృష్ణ ఫంక్షన్‌హాల్, వావిలాలపల్లి, కరీంనగర్.
Opp: Mediplus. సెల్: 97042 10512, 80150 32052
Eenadu KNR-8008709950



మేమున్నాం.. మీకు తోడుగా...
(10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

ఉపకార వేతనాల విడుదలకు వినతి

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇల్లంతకుంట తహసీల్దార్ ఫారూక్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్ వినతి పత్రం అందజేశారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల శాఖ అధ్యక్షుడు పెండెల ఆదిత్య, డీవైఎఫ్ఐ కార్యదర్శి పినకాశి నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, అమన్, హరికృష్ణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను విడుదల చేయాలంటూ ముస్తాబాద్ తహసీల్దార్ సురేశ్‌కు విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం వినతి పత్రం అందించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం ముట్టడి పేరుతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల నుంచి విద్యార్థులు కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఉపకార వేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాకేశ్, విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సంఘం నాయకులు ర్యాలీగా వెళ్లి ఇన్‌ఛార్జి తహసీల్దారు మారుతిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, రాబిన్‌సన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు వేములవాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మహేశ్‌కుమార్‌కు విద్యార్థి సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, భరత్, శివ, ప్రభాస్, రవితేజ తదితరులు పాల్గొన్నారు

వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద పద్ధతిపై ఆచార్యులు, సహాయ ఆచార్యులు, సీనియర్ రెసిడెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాలేజీ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ ఫారం డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. వచ్చే నెల 5న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల నకలతో వాక్ ఇన్ ఇంటర్వ్యూకు కలెక్టరేట్‌కు రావాలని కోరారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకోం

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణను మాజీ శాసన సభ్యుడు రసమయి బాలకిషన్ విమర్శిస్తే ఊరుకునేది లేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లంతకుంటలో మాట్లాడుతు రసమయి బాలకిషన్ దళిత బంధు పేరుతో కమీషన్లు వసూలు చేశారని ఆరోపించారు. మీరు చేసిన అరాచకాలు, మోసాలు, వసూళ్లపై చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఎలగందుల ప్రసాద్, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, బడుగు లింగం, తాట్ల వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

27న ధర్మయుద్ధ మహాసభ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: జగిత్యాలలో ఈ నెల 27న తలపెట్టిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కానపురం లక్ష్మణ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజం, భగవంతు, దేవయ్య, రాజు, పొత్తూరి రాజు, అశోక్, సత్తయ్య, శరవింద్, సురేశ్, బాబు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: జగిత్యాలలో జరగనున్న సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సావనపెల్లి నాంపల్లి, ఈదుల మధు, కవ్వంపల్లి మొండయ్య, పందుల రవి, గడ్డం సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్ల మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించి కనీస వేతనం రూ.26,000 అందించాలని తెలిపారు. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, పీఆర్సీ సమస్యలు పరిష్కరించాలన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నల్‌దాస్ గణేశ్, శంకర్, నర్సయ్య, రాజయ్య, భారతమ్మ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన భారాస ఎస్టీ సెల్ నాయకుడు అజ్మీరా తిరుపతినాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేటీఆర్‌ను సిరిసిల్లలో శుక్రవారం కలిశారు. గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. సేవాలాల్, జగదాంబ ఆలయాలతోపాటు గ్రామ పంచాయతీ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, బాల్‌సింగ్, దేవేందర్, రమేశ్‌నాయక్, కైలాస్, రాములు, రమేశ్‌నాయక్, కాల్యానాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన

ముస్తాబాద్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముస్తాబాద్ ఠాణాలో ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.


విద్యార్థులకు వివరిస్తున్న ఎస్సై గణేశ్

కేసుల నమోదు, పోలీసుల విధులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సై ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన సతీశ్ ఎస్సై ఉద్యోగానికి ఎంపికై కరీంనగర్ పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరాడు. రాచర్ల బొప్పాపూర్‌లో తాను చదువుకున్న జ్ఞానదీప్ పాఠశాలకు శుక్రవారం రాగా పాఠశాల నిర్వాహకుడు మిట్టపల్లి లక్ష్మీనారాయణ అతనిని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి రహదారికి మోక్షమెప్పుడో?


న్యూస్‌టుడే, గంభీరావుపేట

మండలంలోని నాగంపేటకు వెళ్లే కిలో మీటరు మట్టి రోడ్డుకు మోక్షం కలగడం లేదు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు చాలాసార్లు కేటీఆర్‌కు వినతి పత్రాలు అందించారు. అధికారులు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయినా నిధులు రాక పక్కా రహదారి నిర్మాణం కలగా మారింది.


నాగంపేటకు వెళ్లే మట్టి రోడ్డు

మండలంలోని నాగంపేట నుంచి ఇతర గ్రామాలకు వెళ్లడానికి అయిదు మార్గాలు ఉన్నాయి. నాలుగు దిక్కులా బీటీ రోడ్డు ఉన్నప్పటికీ పొన్నాలపల్లి ప్రధాన రహదారికి వెళ్లే కిలోమీటరు మట్టి రోడ్డుకు మోక్షం కలగడం లేదు. ఈ మార్గంలో నిత్యం చాలా మంది గంభీరావుపేట మండల కేంద్రానికి వస్తుంటారు. నాగంపేటతో పాటు మల్లుపల్లి, సముద్రలింగాపూర్ గ్రామస్థులు సైతం గంభీరావుపేట మండల కేంద్రానికి వివిధ పనుల మీద వెళ్తుంటారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు రూ.90 లక్షలతో ప్రభుత్వానికి చాలాసార్లు ప్రతిపాదనలు పంపించారు. అయినా నిధులు మంజూరు కాలేదు. దీంతో ఈ మార్గంలో వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి పక్కా రహదారి నిర్మించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

అధ్వానంగా ఉంది



నాగంపేట ప్రజలకు చాలా ముఖ్యమైన రహదారి అధ్వానంగా ఉంది. వర్షాకాలంలో గుంతలు పడి రాత్రి సమయంలో చాలాసార్లు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ మా గ్రామానికి వచ్చిన సమయంలో ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా బీటీ రోడ్డు నిర్మించి ప్రయాణికులు, వాహనదారుల అవస్థలు తొలగించాలి. **- రాజిరెడ్డి, నాగంపేట**

కొత్తగా బాధ్యతలు చేపట్టా

నేను రెండు రోజుల కిందటే బాధ్యతలు చేపట్టాను. ఈ విషయం నాకు తెలియదు. రోడ్డును పరిశీలించి సమస్యను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. **- వేణు, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ**

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పని తీరు, వాటి సమస్యలు, సిబ్బంది కొరత వంటి పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉన్న రెండు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 13 పీహెచ్‌సీల పరిధిలోని సమస్యలు, అవసరమైన మౌలిక వసతులు, జనరేటర్, సివిల్ పనుల మరమ్మతులు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక వసతులు, వైద్య పరికరాలు, సామగ్రి తదితర వాటికి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. క్రమపద్ధతి ప్రకారం మంజూరు చేయనున్నట్లు చెప్పారు. రోగుల సంఖ్య పెంచాలని, పెద్దలింగాపూర్, చందుర్తి పీహెచ్‌సీ భవనాలను ప్రారంభించడానికి సిద్ధం చేయాలన్నారు. గర్భిణుల గుర్తింపు, రిజిస్ట్రేషన్ వందశాతం జరగాలని తెలిపారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి వసంతరావు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా రక్షణ కోసం పని చేస్తూ అమరులైన పోలీస్‌ల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. శుక్రవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలో జిల్లా పోలీస్‌శాఖ, 17వ బెటాలియన్ సంయుక్తంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి గాంధీచౌక్, అంబేడ్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, నేతన్న చౌరస్తా మీదుగా ఎస్పీ క్యాంపు కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు స్వీయ రక్షణతో పాటు తన కుటుంబ క్షేమం కోసం శిరస్త్రాణం తప్పక ధరించాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. సాయంత్రం జిల్లా కేంద్రంలో నేతన్న చౌక్ నుంచి కొత్త బస్టాండ్, అంబేడ్కర్, గాంధీ చౌక్ మీదుగా బతుకమ్మ ఘాట్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఆర్ఐలు మధుకర్, రమేశ్, సీఐలు, 17వ బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్ల ర్యాలీలో ఎస్పీ అఖిల్ మహాజన్, బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు, పోలీస్ అధికారులు

వీటీఏడీఏ పరిధిలోకి 152 రెవెన్యూ గ్రామాలు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) పరిధిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అభివృద్ధి కోసం పరిధి పెంచినట్లు పేర్కొంది. గతంలో వేములవాడ మున్సిపల్‌తో పాటు వేములవాడ మండలంలోని గ్రామాలు వీటీఏడీఏ పరిధిలో ఉండేవి. ప్రస్తుతం జిల్లాలోని సిరిసిల్ల మున్సిపాలిటీతోపాటు వేములవాడ గ్రామీణం, ఇల్లంతకుంట, బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాల్లోని 152 రెవెన్యూ గ్రామాలను వీటీఏడీఏ పరిధిలోకి తీసుకువస్తూ జీవో జారీ చేసింది. ఈ విషయమై వీటీఏడీఏ కార్యదర్శి అన్వర్‌ను సంప్రదించగా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని తెలిపారు.

శ్రీసీతారామచంద్రస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

వట్టిమల్ల (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం వట్టిమల్లలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.


విద్యార్థులతో ముచ్చటిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

అనంతరం స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రభుత్వ విప్‌ను ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సన్మానించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. స్వీట్లు పంపిణీ చేశారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

సీసీ నిర్మాణానికి భూమిపూజ

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ మున్సిపల్ కార్యాలయం ముందు సీసీ నిర్మాణానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి శుక్రవారం భూమిపూజ చేశారు. మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి ప్రధాన రోడ్డు వరకు సీసీ నిర్మాణానికి ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.5 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు దాదాపు 70శాతం వరకు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన పనులను నిధుల కోసం ప్రభుత్వ విప్‌నకు విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కమిషనర్ సంపత్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ బింగి మహేశ్, టీపీవో అన్సర్, ఏఈ నరసింహస్వామి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఛైర్‌పర్సన్ మాధవి

శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: నేరం చేస్తే శిక్ష తప్పదని, శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిందితులకు శిక్షపడటంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమని చెప్పారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిందితులకు కచ్చితంగా శిక్ష పడేవిధంగా కృషి చేయాలన్నారు. వివిధ సంఘటనల్లో నిందితులపై నమోదైన కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు మొదలు, కేసు విచారణ, కోర్టులో విచారణ, ఛార్జిషీట్‌లో దొర్లే పొరపాట్లను ఎలా సరిచేయాలో పోలీసు అధికారులకు వివరించారు. పోలీస్ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టే పద్ధతిని తెలిపారు. గడిచిన సంవత్సర కాలంలో 61 కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు, మూడు కేసుల్లో జీవిత ఖైదును కోర్టు విధించినట్లు పేర్కొన్నారు. శిక్ష పడేవిధంగా కృషి చేసిన పీపీలు, కోర్టు కానిస్టేబుళ్లకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

వానరాల మృత్యువాత కలకలం

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వద్ద శుక్రవారం ఓ వెంచర్‌లో భారీ సంఖ్యలో వానరాల మృతదేహాలు ప్రత్యక్షం కావడం కలకలం రేపింది.


నాంపల్లి వద్ద వానరాల మృతదేహాలు

వెంచర్‌లో చెల్లాచెదురుగా కోతుల మృతదేహాలు పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆందోళనకు గురయ్యారు. దాదాపు 50 వరకు వానరాలను ఎక్కడో చంపేసి ఇక్కడ పారేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన రావడంతో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది వాటిని డంపింగ్ యార్డుకు తరలించారు. దీనిపై జంతు సంరక్షణ కార్యకర్త ఎ.గౌతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు.

మధ్యమానేరుకు కొనసాగుతున్న వరద

బోయినపల్లి, న్యూస్‌టుడే: రాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కొనసాగుతుంది. జలాశయానికి వరద కాలువ ద్వారా 3,390 క్యూసెక్కులు వస్తోంది.


వరద కాలువ ద్వారా జలాశయానికి వస్తున్న నీరు


జలాశయం నుంచి దిగువన ఎల్ఎండీకి 3,200 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.61 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప పేర్కొన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ బండి దేవదాస్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, డైరెక్టర్లు సత్యనారాయణరెడ్డి, దేవేందర్, వెంకటేశం, కొండయ్య, నక్క నర్సయ్య, మాజీ సర్పంచి జక్కుల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ (ఎల్లారెడ్డిపేట): వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్‌పర్సన్ షేక్ సాబేరా బేగం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ పీఏసీఎస్ పరిధిలో గ్రామంలో నెలకొల్పిన కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ రామగిరి సుధీర్‌రావు, ఉపాధ్యక్షుడు బుగ్గ కృష్ణమూర్తిశర్మ, డైరెక్టర్లతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పీఏసీఎస్ కార్యాలయంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ సాబేరాబేగం, డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, మాజీ సర్పంచి రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు రాజేందర్, శ్రీనివాస్, కిష్టారెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


తిమ్మాపూర్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ ఛైర్‌పర్సన్ సాబేరాబేగం, పీఏసీఎస్ ఛైర్మన్ సుధీర్‌రావు తదితరులు


చీర్లవంచలో పారంభిస్తున్న ఏఎంసీ అధ్యక్షురాలు స్వరూప తదితరులు

కొనుగోళ్లు ప్రారంభించాలంటూ నిరసన

కొండాపూర్ (ముస్తాబాద్): ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలంటూ ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామ కొనుగోలు కేంద్రంలో రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అకాల వర్షంతో తడిసి ముద్దవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కల్లాలు లేవన్నారు. రోడ్లపై ఆరబెడితే పోలీసులు కేసులు నమోదు చేస్తామన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, ధాన్యం సేకరించడం లేదని వాపోయారు. కార్యక్రమంలో మంద బాల్‌రెడ్డి, రాజం నారాయణ, వెంకట్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.


కొండాపూర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు


సిరిసిల్ల దీక్షలో మాజీ సర్పంచులు

కొనసాగుతున్న దీక్షలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఏడో రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. వీరికి పలువురు నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు అంజయ్య, గణప శివజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

బోయినపల్లి, న్యూస్‌టుడే: తడగొండలోని పోచమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన చేపూరి శ్రీను రూ.50వేల విరాళాన్ని శుక్రవారం అందించాడు. ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపాడు.

ముగ్గురిపై కట్నం కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మోషన్‌పూర్ గ్రామానికి చెందిన ముగ్గురిపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ శుక్రవారం రాత్రి తెలిపారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన అఖిలకు 2014 ఏప్రిల్ 16న మోషన్‌పూర్‌వాసి నరేశ్‌తో వివాహమైందని పేర్కొన్నారు. అన్ని లాంఛనాలతో పెళ్లి చేసినప్పటికీ పుట్టింటి నుంచి రూ. 5 లక్షలు అదనంగా తీసుకురావాలంటూ అఖిలను ఆమె భర్త నరేశ్, ఆడబిడ్డ కృష్ణవేణి, ఆడబిడ్డ భర్త చంద్రం మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశారని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో జైలు

నేర వార్తలు

వేములవాడ, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష పడినట్లు వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్‌కు చెందిన మైలారం శ్రీనివాస్‌కు చెందిన కరెంట్ మోటార్ వైరును నిజామాబాద్ జిల్లా వీరన్నగుట్ట గ్రామానికి చెందిన గుండారం గంగారాం దొంగిలించాడు. ఈ మేరకు బాధితుడు శ్రీనివాస్ 17.06.2024న పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన వేములవాడ కోర్టు జడ్జి జ్యోతిర్మయి నిందితుడికి నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని హనుమాన్ ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హుండీలోని రూ. 5 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు వివరాలు... హనుమాన్ ఆలయ కమిటీకి ఉత్తం రాజం ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఆకారం రాజవ్వ నిత్యం గుడిని శుభ్రం చేస్తుంది. ఎప్పటిలాగే గురువారం ఉదయం ఆలయాన్ని శుభ్రపరిచిన అనంతరం తాళం వేసి, ఇంటికి వెళ్లింది. శుక్రవారం వెళ్లి చూసేసరికి తాళం పగులకొట్టి ఉంది. ఆలయ కమిటీ ఛైర్మన్ ఉత్తం రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ శుక్రవారం రాత్రి తెలిపారు.

మినీ వ్యాన్, బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులో మినీ వ్యాన్, బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లె గ్రామానికి చెందిన వెల్పుల సంజీవ్, రమేశ్‌లు ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నారు. నేరెల్లలో ఇస్కాన్ ఆలయంలో పంతులుగా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్ సిరిసిల్ల నుంచి జిల్లెల్ల వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సంజీవ్, రమేశ్‌లకు తీవ్ర గాయాలు కాగా, ప్రవీణ్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో సిరిసిల్ల పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని హైదరాబాద్ వెళ్తున్న మాజీ మంత్రి కేటీఆర్ ప్రమాద ఘటనను చూసి వాహనం ఆపి, విషయం తెలుసుకొని వెంటనే 108కు కాల్ చేశారు. అంబులెన్స్‌లో క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు.

రాజన్న హుండీ లెక్కింపులో సిబ్బంది చేతి వాటం

ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు సమయంలో ఒప్పంద ఉద్యోగి చేతివాటం ప్రదర్శించిన విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఆలయ ఓపెన్ స్లాబ్‌లో గురువారం హుండీ లెక్కింపు పూర్తయిన తరవాత ఖాళీ సంచులను పోగు చేసే క్రమంలో ఒప్పంద ఉద్యోగి ఒకరు రూ.2 లక్షల నగదును కాజేసే ప్రయత్నం చేయగా ఇది గమనించిన ఎస్‌పీఎఫ్ సిబ్బంది గుర్తించి అతనిని పట్టుకొని ఆలయ అధికారులకు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని ఆలయ అధికారులు, సిబ్బంది గోప్యంగా ఉంచడం మరింత అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై ఈవో వినోద్‌రెడ్డిని వివరణ కోరగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు రూ.500 నోట్ల కట్టలు కాజేసే ప్రయత్నం చేశాడని, అతనిని విధుల నుంచి తొలగించామని తెలిపారు. మరో మహిళా హోంగార్డుపై వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని సత్తెపీరీల దర్గా వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీను పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ శుక్రవారం రాత్రి తెలిపారు. గస్తీ నిర్వహిస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన ఇసుక లారీని ఆపి, తనిఖీ చేశామన్నారు. ఇసుక రవాణాకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేశామన్నారు. బావుపేట నుంచి కామారెడ్డికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తేలిందని పేర్కొన్నారు. కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ చొప్పరి స్వామి, వాహన యజమాని పెంట రమేశ్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

(c) eenadu

నేటి నుంచి దీపావళి ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ఇందులో రెండు ఉమ్మడి జిల్లావాసులకు అందుబాటులో ఉన్నాయి. సికింద్రాబాద్-పట్నా ప్రత్యేక రైలు శనివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి ఆదివారం రాత్రి 7 గంటకు పట్నా చేరుకుంటుంది. తిరిగి ఆదివారం రాత్రి 9.20కి పట్నాలో బయల్దేరి మంగళవారం ఉదయం 8.30కి సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. ఇదే రైలు తిరిగి నవంబరు 2, 9 తేదీల్లో పట్నా వైపు, 4, 11 తేదీల్లో సికింద్రాబాద్ వైపు నడుస్తుంది. మరో ప్రత్యేక రైలు మౌలాలిలో ఈ నెల 28న సాయంత్రం 4.45కి బయల్దేరి 30న తెల్లవారుజామున 2.30కి యూపీలోని ముజఫర్‌పూర్‌కు చేరుతుంది. అదే రోజు ఉదయం 4.50కి అక్కడి నుంచి బయల్దేరి 31న రాత్రి 7 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు నవంబరు 4, 11 తేదీల్లో ముజఫర్‌పూర్ వైపు, 6, 13 తేదీల్లో లింగంపల్లి వైపు నడుస్తుంది. ఈ రెండు ప్రత్యేక రైళ్లకు పెద్దపల్లి, రామగుండంలలో హాల్టింగ్ ఇచ్చారు.

5 నుంచి బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో జరిగే బీఈడీ రెండో సెమిస్టర్ (సీబీసీఎస్-రెగ్యులర్, బ్యాక్‌లాగ్) పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా. శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కెట్‌కు 164 ట్రాలీల విడిపత్తి

జమ్మికుంట : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం 164 ట్రాలీల విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో విడిపత్తి క్వింటా కనిష్ఠ ధర రూ.6,000, గరిష్ఠ ధర రూ.6,700 పలికింది. 44 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా రూ.5,800 నుంచి రూ.6,400 వరకు వ్యాపారులు ఖరీదు చేశారు.

భద్రత కల్పిస్తూ...
బాధ్యత తెలియజేస్తూ!

- విద్యార్థులు, పోలీసులకు అవగాహన
- కొనసాగుతున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు


బాంబును నిర్వీర్యం ఎలా చేస్తారో వివరిస్తున్న నిపుణులు

న్యూస్‌టుడే, కరీంనగర్ నేరవార్తలు

దేశం కోసం ప్రాణాలర్పించిన త్రివిధ దళాల సైనికులు, రాష్ట్ర పోలీసులను స్మరిస్తూ.. ఏటా అక్టోబరు 21న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. అమరులైన వారి సేవలను ప్రతి ఒక్కరికి గుర్తుండేలా వివిధ అంశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే.. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు వివిధ సేవలపై వివరిస్తున్నారు.

ఆయుధాల ప్రదర్శన.. జాగిలాల విన్యాసం

■ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరేడ్ మైదానంలో ఓపెన్ హౌజ్ ఏర్పాటు చేశారు. ఇందులో పోలీసు వినియోగిస్తున్న ఆయుధాలను ప్రదర్శించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఏ ఆయుధాన్ని ఎలాంటి సందర్భాల్లో వినియోగిస్తారో వివరిస్తున్నారు. నేరగాళ్లు ఒకరిగా వచ్చినప్పుడు, గుంపులుగా వచ్చినప్పుడు ఎలాంటి ఆయుధాలు వాడుతారో తెలుపుతున్నారు.

■ పోలీసు జాగిలాల విన్యాసం అందరిని అకట్టుకుంటుంది. బాంబు స్క్వాడ్ నిపుణులు వాటిని గుర్తించే విధానంపై తెలియజేస్తూ.. అత్యవసర సమయంలో ఉపయోగించే గ్యాస్ టియర్, శరీర రక్షణ కవచంపై వివరిస్తున్నారు. అలాగే సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్నారు.

■ ప్రస్తుతం మహిళలు, విద్యార్థినులపై. పాఠశాల, కళాశాల తదితర ప్రాంతాల్లో ఘటనలపై షీటీం బృందం లఘు చిత్రం రూపొందించి విద్యార్థుల కోసం ప్రదర్శిస్తోంది. కేసులు నమోదైతే జరిగే పరిణామాలను సైతం వివరిస్తున్నారు.

■ రవాణాకు సంబంధించి.. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. ఇందుకోసం పరేడ్ మైదానంలో ట్రాఫిక్ సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెల్మెట్ వినియోగంపై వీడియో రూపంలో వివరిస్తున్నారు. ప్రమాద సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, బీమా, ఆర్‌సీ తదితర వెంట ఉంటే కలిగే ఫలితాలపై తెలియజేస్తున్నారు.

రక్తదానం.. మహాదానం

అత్యవసర పరిస్థితిలో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నారు. సిబ్బందిలో స్ఫూర్తి నింపేందుకు కరీంనగర్ కమిషనర్ అభిషేక్ మహంతి రక్తదానం చేసి అందరిని ప్రోత్సహించారు. సుమారు 200 మంది రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు.

■ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాయామం చేయడం ప్రతి ఒక్కరిలో తగ్గిపోతుంది. 'తమ చేతుల్లోనే ఆరోగ్యం' అనే నినాదంతో పోలీసుశాఖ సైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

వ్యాసరచన, లఘుచిత్రంపై పోటీలు



వారోత్సవాల్లో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు పలు అంశాలపై ఆన్‌లైన్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. పోలీసు సిబ్బంది అత్యవసర సమయంలో చేసిన సాయంపై తీసిన ఫొటోలపై బహుమతులు.. వారి విధి నిర్వహణపై రూపొందించే చిత్రానికి తగిన గుర్తింపు ఇవ్వనున్నారు. వారోత్సవాల చివరి రోజు పోలీస్ కమిషనర్ బహుమతులు అందిస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోటీలకు సైతం ఎంపిక చేయనున్నారు.

వ్యక్తిగత కక్షతోనే హత్య
నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ వెల్లడి

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా గ్రామీణ మండలం జాబితాపూర్‌లో జరిగిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి హత్య కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జాబితాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ తండ్రి లచ్చన్న పెద్దనాన్న ముత్తయ్య మధ్య భూ వివాదం ఉంది. ముత్తయ్య తరపున అదే గ్రామానికి చెందిన గంగారెడ్డి పెద్ద మనిషిగా ఉండగా వివాదం పరిష్కారం కాలేదు. అంతేగాకుండా 2020లో సంతోష్‌పై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా వచ్చే నెల 25 నుంచి ట్రయల్ ప్రారంభం కానుంది. ఈ కేసులో రాజీకుదిర్చేందుకు సంతోష్ 15 రోజుల కిందట గంగారెడ్డిని సంప్రదించగా అతను అంగీకరించకపోగా దూషించడంతో ఎలాగైనా అతనిని హతమార్చాలని నిర్ణయించుకున్నారు. అద్దెకారు, ఒక కత్తి తెచ్చుకొని ఈనెల 22న ఉదయం 8 గంటలకు గంగారెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుకనుంచి ఢీకొట్టి అదుపుతప్పి కిందపడగానే ఛాతి తదితర ప్రాంతాల్లో కత్తితో పొడిచి హతమార్చాడు. సంఘటనా స్థలంలోనే సెల్‌ఫోన్, కారు వదిలేసి పారిపోగా గంగారెడ్డి భార్య మారు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్పీ వివరించారు. నిందితుడిపై ఇదివరకే జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలో 3, గొల్లపల్లి స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదైందన్నారు. పథకం ప్రకారం హత్యకు పాల్పడ్డట్లు విచారణలో తేలిందని, ఈ కేసులో ఇతరుల ప్రమేయం ఉందనే విషయమై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ..
ఇద్దరి దుర్మరణం


శ్రీనివాస్‌గౌడ్


దగ్గుల స్వామి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన మెట్‌పల్లి మండలంలో శుక్రవారం విషాదం నింపింది. పోలీసులు, గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌కు చెందిన పోతుగంటి శ్రీనివాస్ గౌడ్(45) గ్రామంలో కల్లుగీత వృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రాయికల్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి తన మేనల్లుడు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన ఉట్నూరి నివాస్‌తో కలిసి వెల్లుల్ల మీదుగా స్వగ్రామానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మండలంలోని వెల్లుల్లకు చెందిన దగ్గుల స్వామి(55) కొన్నేళ్లుగా కుటుంబంతో కలిసి మెట్‌పల్లి పట్టణంలో నివాసముంటున్నాడు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి సుమారు మూడేళ్ల కిందట తిరిగొచ్చి స్థానికంగా చేపలు పడుతూ ఉపాధి పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. వెల్లుల్లకు పని నిమిత్తం వచ్చి తల్లి, ఇతర కుటుంబ సభ్యులను కలిసిన అనంతరం ద్విచక్ర వాహనంపై తిరిగి మెట్‌పల్లికి వెళ్తున్నాడు. వెల్లుల్ల శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో శ్రీనివాస్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామికి తీవ్ర గాయాలు కాగా వెంటనే స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. స్వామికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

28న పీఎఫ్ మీ ముంగిట

చైతన్యపురి, న్యూస్‌టుడే : కరీంనగర్ భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈనెల 28న పీఎఫ్ మీ ముంగిట (నిధి ఆప్కే నికత్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ సెల్వత్కర్ తానయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు అవగాహన కల్పించి, భవిష్యనిధి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

జిల్లా	కార్యక్రమం జరిగే ప్రదేశం
కరీంనగర్	తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామం హరిత బయో ప్రొడక్ట్స్ ఇండియా ప్రైవేట్ సంస్థ
పెద్దపల్లి	సుల్తానాబాద్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనం
జగిత్యాల	విద్యానగర్ మెప్మా సమావేశ గది
సిరిసిల్ల	వేములవాడ మున్సిపల్ కార్యాలయం

29న ఎంపిక పోటీలు

కరీంనగర్ క్రీడా విభాగం: కొత్తపల్లి అకాడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాలలో ఈ నెల 29న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్స్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్ తెలిపారు.

గుట్టను తొలిచి.. నిర్మాణంగా మలచి



ఈనాడు, సిరిసిల్ల: జిల్లాలో అదో మారుమూల తండా. చుట్టూ అటవీ ప్రాంతం. నివాస గృహాలకు స్థలాలు తక్కువ. అలాంటిది పంచాయతీ భవన నిర్మాణం కష్టం. దీనికి తండా వాసులంతా ఆలోచనలో పడ్డారు. చివరికి వారు ఉంటున్న గుట్టను తొలిచి రూ.20 లక్షలతో భవనం నిర్మించారు. ఇదే అడ్డబోరు తండా పంచాయతీ. ఇదే కాకుండా క్రీడా మైదానం, సేవాలాల్ ఆలయం నిర్మించేందుకు మరింత స్థలం చదును చేశారు. ఈ పంచాయతీ భవనం మానాలలోని ఏ తండా నుంచి చూసినా ఎత్తులో కనిపిస్తుంది. వీరి ఐకమత్యం చూసి చుట్టుపక్కల వారు ఔరా అంటున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


వినయ్

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన గుండా వినయ్(25) విద్యుదాఘాతంతో మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న వినయ్ శుక్రవారం గ్రామంలోని ఎమ్మార్పీ ఇటుక బట్టీలో విద్యుత్తు తీగలు సరి చేయడానికి వెళ్లారు. నిచ్చెనపైకి ఎక్కి పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

EENADU Classifieds

AUTO

TWO WHEELER

E-Bike 16,500/- రూ.లకే ఇవ్వబడును. ప్రారంభోత్సవ ఆఫర్. Aarvi Enterprises, RTC వర్క్‌షాప్ ఎదురుగా, జగిత్యాల రోడ్, కరీంనగర్. 93811 28358.

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

SRILALITHA
● RICE ● IDLY RAVVA ● RICE RAVVA ● ATTA ● MAIDA ● SUJI
Valuthimmapuram Road, Peddapuram, A.P.
ఈ క్రింది ఏరియాలకు ఔట్‌లెట్ నిర్వహించుటకు కావలెను.
జనగాం, భూపాలపల్లి, కరీంనగర్, సిద్ధిపేట, నిజామాబాద్, నర్సన్నపేట, సదాశివపేట. సంప్ర॥
98481 32325
83175 11697
94948 54544

EDUCATION

MBA/ MCA Management Quota Seats are available, Interested Candidates may Contact: 98662 97888, 63015 19880.

COACHING CENTRES

Abhyas Academy. Navodaya & Sainik (5th & 8th Classes) Day & Residential Short term batch starts (Target Batch) 3rd Nov. Cont: 99493 84416. KNR.

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs.490/- Only
Colour Rs. 575/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Karimnagar:
99590 97631
80087 09949

PERSONAL CLASSIFIEDS

LOST

నా పేరు Rangineni Sujatha, W/o. Rangineni Mohan Rao, నివాసం: H.No. 2-8-11 (New 2-8-19) Flat No. 104, రంగినేని అపార్ట్‌మెంట్, ముకరంపుర, కరీంనగర్. నా పాస్‌పోర్ట్ నెంబర్ H3419205 (Expiry Date: 25-03-2019), నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ గల కవర్ కరీంనగర్ గీతాభవన్ ఏరియాలో పోయినది. దొరికినవారు సంప్ర: సెల్: 99494 22272.

నా పేరు Rangineni Mohan Rao, S/o. Rangineni Ramchander Rao, నివాసం: H.No. 2-8-11 (New 2-8-19) Flat No. 104, రంగినేని అపార్ట్‌మెంట్, ముకరంపుర, కరీంనగర్. నా పాస్‌పోర్ట్ నెంబర్ H3422646 (Expiry 30-3-2019), నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ గల కవర్ కరీంనగర్ గీతాభవన్ ఏరియాలో పోయినది. దొరికినవారు సంప్ర: సెల్: 98490 12459.

REAL ESTATE

LAND FOR SALE

16 Guntas Land Highway Road RK Colony, Karimnagar with House and Borewell. Contact: Cell: 9848043704, 7780646886.

PLOT FOR SALE

Plots For Sale: 1000 & 1210 Sq. Yards (8 & 10 Guntas) Near SRR College, Jagityal Road, Karimnagar Town. Cell: 97035 44199.

395 Sq.Yds W/F Plot for Sale in Gated Community, Thumkunta, Shamirpet. Nr. Bits Pilani & Karimnagar H/W, inside the ORR. 9959859751.

LAND REQUIRED

Plots Required: Wanted Plots & Acre's of Lands: Shameerpet, Vidharba, Aliyabad, Indus Park, Celebrity Homes, My Space, Gayatri Layout, Thumkunta, Orjitha Layout, Silent wold, SNR Layout, Thimmaipally, Bollaram and Near by. Contact: 99499 22669.

పెద్దపల్లి జిల్లాలో 30 సం.లు లీజుకు 1000 ఎకరముల భూమి కౌలుకు కావాలి. 1 సం.ము డిపాజిట్ + ప్రతి సం. కౌలు. దీర్ఘకాల వృక్షారోపణ కొరకు. సంప్ర: Cell: 81868 22222.

JOBS

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్+ భో॥ Hyd. Ph: 9182260297.

మ్యారేజ్ బ్యూరో నందు పని చేయుటకు అమ్మాయి కావలెను. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పని చేసే అమ్మాయి కావాలి. Cell: 83412 20970.

రాఘవ ఆటో ఫైనాన్స్, జగిత్యాల, పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాలలో అనుభవం కలిగిన ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. కరీంనగర్ ఆఫీస్‌లో కంప్యూటర్ నైపుణ్యం కలిగిన 32 సం.ల లోపు వారు కావలెను. సెల్: 91009 02180, 81, 82.

హైదరాబాద్ & తెలంగాణా జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా / ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 8008289703

కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలంలో మహిళా రైతు సంఘంలో పనిచేయుటకు ఫీల్డ్ ఆఫీసర్ కావలెను. జీతం: 10 వేలు +T.A., ఫీల్డ్ వర్క్. 99663 07593

FACULTY/ TEACHERS

English and Social Teachers for Akshara Int School (VI- X) Korutla, Jagtial. Salary Rs 35000-40000 month. Ph: 8977421573.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99590 97631
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14779

ఉడుం పట్టు.. అదిరేట్టు!

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన కుస్తీ వీరులు

న్యూస్‌టుడే, కరీంనగర్ క్రీడా విభాగం

గత అయిదు ఒలింపిక్స్‌లో మన దేశానికి పతకం తెచ్చిన క్రీడల్లో కుస్తీ(రెజ్లింగ్) ఒకటి. ఈ క్రీడలో రాణించాలంటే శరీర బలంతోపాటు గుండె ధైర్యం కూడా ఉండాలి. తక్కువ సమయంలో ప్రత్యర్థిని పట్టుబట్టి పాయింట్లు రాబట్టాలి. 2012లో కరీంనగర్‌కు కుస్తీ కోచ్ రావడం, జాతీయ స్థాయి ప్రమాణాలున్న మ్యాట్ చొప్పదండి మండలం రుక్మాపూర్ క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేయడంతో జిల్లాలో కుస్తీకి ఆదరణ పెరిగింది. 2020 వరకు రాష్ట్ర స్థాయి పోటీల్లో కరీంనగర్ క్రీడాకారులు ఛాంపియన్లుగా నిలిచారు. కోచ్ బదిలీ కావడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ క్రీడకు కొంత ఆదరణ తగ్గినా.. ఆటపై ఉన్న మక్కువతో క్రీడాకారులు మళ్లీ పుంజుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఈనెల 15, 16న జరిగిన పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి అండర్-19 పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులపై 'న్యూస్‌టుడే' కథనం.


రాష్ట్ర స్థాయి అండర్-19 కుస్తీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఏడాది శిక్షణలో రెండు పతకాలు




ఉప్పలయ్య-నాగమణిల కుమారుడు తిప్పర్తి సిద్ధార్థ రుక్మాపూర్ సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాలలో అంతర్జాతీయ స్థాయి మ్యాట్ ఏర్పాటు చేసి.. మెరుగైన శిక్షణ ఇవ్వడంతో ఏడాది నుంచి శిక్షణ పొందుతున్నాడు. 2024లో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో బంగారు పతకం.. రాష్ట్ర స్థాయి పోటీల్లో వెండి పతకం సాధించాడు.



బంగారు పతకమే లక్ష్యం

గుండియా నాయక్-సుశీల దంపతుల కుమారుడు దినేష్ చొప్పదండి మండలం రుక్మాపూర్‌లోని సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాలలో కోచ్ వంశీకృష్ణ సారథ్యంలో ఏడాది నుంచి కుస్తీ సాధన చేస్తున్నాడు. 2023లో రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అండర్-17 పోటీల్లో కాంస్యం, హనుమకొండలో జరిగిన ఎస్జీఎఫ్ పోటీల్లో రజతం, 2024లో హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో కాంస్య పతకాలు సాధించాడు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని దినేష్ చెబుతున్నాడు.



సైన్యంలో చేరాలని..

వ్యవసాయ కుటుంబానికి చెందిన గంగారాం-సావిత్రబాయిల కుమారుడు కె.రాజరత్నం రెండేళ్ల నుంచి కుస్తీలో శిక్షణ పొందుతున్నాడు. 2023లో ఉట్నూర్‌లో.. 2024లో హైదరాబాద్‌లో జరిగిన పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు రజత పతకాలు, ఆదిలాబాద్‌లో జరిగిన సాంఘిక సంక్షేమ సొసైటీ పోటీల్లో రజత పతకం పట్టుకొచ్చాడు. సైన్యంలో చేరి కుస్తీలో అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు రజరత్నం తెలిపాడు.



రవి దహియా స్ఫూర్తితో..

పి.బిక్కుసింగ్, మీరాబాయిల కుమారుడు విజయ్‌కుమార్ 2020 ఒలింపిక్స్‌లో కుస్తీ పోటీల్లో పతకం సాధించిన రవికుమార్ దహియా స్ఫూర్తితో రెండేళ్లుగా సాధన చేస్తున్నాడు. సాధన మొదలుపెట్టిన కొన్ని రోజుల్లోనే పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. 2023 ఆదిలాబాద్‌లో.. 2024 హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు రజత పతకాలు, సాంఘిక సంక్షేమ సంఘం పోటీల్లో రజత పతకం గెలుచుకున్నాడు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డిప్లొమా కోర్సులు
తీరనున్న సిబ్బంది కొరత.. రోగులకు ప్రయోజనం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

తెలంగాణలో కొత్తగా ఏర్పాటు చేసిన 28 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో పారామెడికల్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రెండేసి డిప్లొమా కోర్సుల నిర్వహణకు శాఖాపరమైన అనుమతులు ఇస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలకు ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున రెండు కోర్సుల్లో 60 సీట్లను కేటాయించింది. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలోని వైద్య కళాశాలల్లో మొత్తం 1,680 మంది విద్యార్థులు పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరవచ్చు. ప్రవేశాల ప్రక్రియ కళాశాల ప్రిన్సిపల్‌లు నిర్వహించనుండగా.. తరగతులను ఆయా కళాశాలలకు అనుబంధంగా ఉండే బోధనాసుపత్రుల్లోనే నిర్వహించనున్నారు.

వైద్య సేవల్లో కీలకం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం, అవసరమైన సహాయ సహకారాలు, వైద్య పరీక్షలు నిర్వహించడంలో పారామెడికల్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారు. అనుబంధ ఆస్పత్రుల్లో కూడా సిబ్బంది కొరత తీరనుంది. ప్రజలకు మెరుగైనా వైద్య సేవలు అందనున్నాయి. ల్యాబ్ టెక్నీషియన్, ఈసీజీ, డయాలసిస్, రేడియో థెరపీ, డెంటల్, ఆప్తామాలజీ టెక్నీషియన్ తదితర 21 రకాల పారామెడికల్ కోర్సులను నూతన వైద్య కళశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఔత్సాహిక విద్యార్థులు ఆయా వైద్య కళాశాలల్లో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలి.

వైద్య కళాశాల	కోర్సులు
కరీంనగర్	అనస్థీషియా టెక్నీషియన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్
జగిత్యాల	డయాలసిస్ టెక్నీషియన్ ఈసీజీ టెక్నీషియన్
రామగుండం	డయాలసిస్ టెక్నీషియన్ ల్యాబ్ టెక్నీషియన్
రాజన్న సిరిసిల్లా	అనస్థీషియా టెక్నీషియన్ ఈసీజీ టెక్నీషియన్

అర్హతలు: ఇంటర్మీడియట్ చేసిన వారు అర్హులు. బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. డిప్లొమా ఇన్ రేడియో థెరపీ టెక్నీషియన్ మాత్రం తప్పనిసరిగా బైపీసీ లేదా ఎంపీసీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి.

కోర్సు కాలపరిమితి: రెండు సంవత్సరాలు

ముఖ్యమైనా తేదీలు

అక్టోబర్ 30 : దరఖాస్తుల సమర్పణకు తుది గడువు.

నవంబర్ 13 : సీట్ల కౌన్సెలింగ్.. కేటాయింపునకు..

నవంబర్ 20 : ఎంపికైనా విద్యార్థుల వివరాలను పారామెడికల్ బోర్డునకు సమర్పణకు

నవంబర్ 22 : కోర్సుల్లో చేరిన విద్యార్థుల వివరాలు పారామెడికల్ బోర్డుకు పంపించడానికి

నవంబర్ 25 : తరగతుల ప్రారంభం

ఉద్యోగ, ఉపాధికి భద్రత

పారామెడికల్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి భద్రత ఉంటుంది. అర్హులైన ఔత్సాహికులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత ధ్రువీకరణ పత్రాలతో వైద్య కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలి. సందేహాలకు 93983 08078 నంబర్ ద్వారా చరవాణిలో సంప్రదించాలి.

- డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని



ఇసుక మాయం.. ముళ్ల పొదలు దర్శనం

ఈ చిత్రంలో కనిపిస్తున్న ముళ్ల పొదలు సాక్షాత్తు వేములవాడ మూలవాగులోనివి. గత కొన్ని సంవత్సరాలుగా ఏటా అక్రమార్కులు ఇసుకను పూర్తిగా తోడేయడంతో అడుగులోతులో మట్టి మిగిలింది. దీంతో వేములవాడ మూలవాగులో ఇసుక మాయమై ఇలా ముళ్ల పొదలు పెరిగి దర్శనమిస్తున్నాయి. ఇది ఒకప్పుడు పూర్తిగా ఇసుకతో దర్శనమిచ్చేది. అలాంటిది ప్రస్తుతం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. **- న్యూస్‌టుడే, వేములవాడ**

అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఎంపిక


అన్వేష్

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కరీంనగర్‌కు చెందిన వారాల అన్వేష్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీలో రూపొందించిన సినిమా 'మోనిహార' అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఎంపికైంది. కేంద్ర సమాచార ప్రసారాల శాఖ ఈ విషయాన్ని శుక్రవారం ప్రకటించింది. భారత కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ వేడుక 2024 నవంబరు 20 నుంచి 28 వరకు గోవాలో జరుగుతుంది. విశ్వనాథ్ ఠాగూర్ రాసిన 'మోనిహార' కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. కోల్‌కత్తా సత్యజిత్ రే ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో సినిమాటోగ్రఫీ పూర్తి చేసిన వారాల అన్వేష్ ప్రస్తుతం హైదరాబాద్ సినిమా రంగంలో పని చేస్తున్నారు. గతంలో పలు చిత్రాలకు పని చేసిన ఈయన ఇండో బంగ్లాదేశ్ లఘు చిత్ర ఫెస్టివల్స్‌తోపాటు పలు అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో ప్రశంసలు అందుకున్నారు.

(c) eenadu